కుటుంబాలున్నాయ్. మనది ఐదో కుటుంబం."

"అయితే...."

"నాలుగు కుటుంబాలు కూడా మేడమ్ కాయిపాస్ మారీ కష్టమల్లే"

"అదేంటిరా ఆంటీనించి మేడమ్‌కు మార్చేసావ్?"

"ఆంటీ అని పిలిస్తే ఆవిడకు కోపంవచ్చి మేడమ్ అని పిలవమంది."

"నయం-ఇంకా మిస్ అని పిలవ మనలేదు" అని ఆదిలక్ష్మి అంటే, "మీ అమ్మకి నువ్వు పుట్టినప్పటికి యిరవై యేళ్ళేనురా! అప్పటినించే ముసలై పోతున్నానని అనుకుందిరా."

"మీరే నా మనసులో వున్నది విన్నారు!"

"యెన్నిసార్లు బయటకు అనలేదు."

"ఎనిమిదే కళ్ళు మూస్తే యేభయి దాటిపోతాయి కదా- ఇంక ముసలి కాకపోతే యేమిటి?"

"ఇక్కడ డబ్బయి యేళ్ళ మామ్మను ఆంటీ అని పిలు! ఖుష్షుమంటుందో లేదో? మనం మానసికంగా అనుకుని అనుకుని వేగంగా ముసలివాళ్ళు అయిపోతాం. వాళ్ళు అలా అంటే ఖుష్షుమని ముసలైనా యౌవ్వనంగా కనిపిస్తారు. అదే మనకూ, వాళ్ళకూ తేడా!"

"ఇంతకీ మనకి త్రివేణీ పక్కపొడి దొరుకుతుందిరా?"

"అప్పుడే ఆర్డరు యిచ్చిందట. రాగానే మనకు రెండు పేకెట్లు ఇస్తానని చెప్పింది"

"హమ్మయ్య! రక్షించింది"

"ఏం ఈవేళ ఫేసు పేలావ్?"

"ఈవేళ మూడ్లో వున్నట్లుంది కదండీ. ఏంరా రవీ నీకు వుక్కపోయటం లేదూ?"

"లేదు"

# మినీ కథ:



అప్పారావు పూర్తిపేరు అసుల అప్పారావు. అయితేటక్కనక్కలా సన్నంగా చప్పిడి దవడలు లోతుకుపోయిన కళ్ళు. నీరసంగా కనిపిస్తాడనే అతని స్నేహితులు అస్థిపంజరం అప్పారావని పిలుస్తారు. మనిషిని చూస్తే సుస్తీ చేసి పది రోజులు లంఘణాలు చేసినట్లు కనిపిస్తాడు. మామగారి ధర్మమా అని పోలీస్‌డిపార్ట్‌మెంటులో రైటర్ ఉద్యోగం దొరికింది. పైసా కట్నం తీసుకోకుండా పెళ్ళి చేసుకున్నందుకు నష్టపోలేదనుకున్నాడు కాని జీతం మరీ తక్కువనగానే నీరసించిపోయాడు. "జీతంతో ఏం నిమిత్తమయ్యా. పైన బాగా దొరుకుతుంది కదా!" అన్న మామగారి మాటలు విని కాస్త స్థిమితపడ్డాడు. టూటౌన్ స్టేషన్‌లో పోస్టింగ్ వచ్చింది. మంచి బిజీ సెంటర్. ఎంతో ఆనంద పడిపోయాడు. చేరిన పది రోజుల వరకూ పిరికితనంతో చెయ్యి చాచడానికి భయపడ్డాడు. అయితే స్టేషన్‌లో మిగిలిన స్టాఫ్ అంతా జేబులు నింపుకుపోతుంటే చాలా బాధ కలిగేది. ఇంక లాభం లేదనుకుని ఆ రోజు ఉదయం నిశ్చయించుకున్నాడు ఏమైనాసరే ప్రారంభోత్సవం చెయ్యడానికి.

పన్నెండు గంటలైనా ఏ కేసు తగలక పోయేసరికి చికాకు వేసింది. బీడీ అంటించి కళ్ళు మూసుకుని గట్టిగా ఒక్క దమ్ము లాగి కళ్ళు తెరిచేసరికి ఎదురుగా కానిస్టేబుల్ వెంకటసామి, అతని ప్రక్కన వంగి వంగి దణ్ణం పెడుతున్న వ్యక్తిని చూసి ఒక చిన్న చిరునవ్వు విసిరాడు- ఏమిటి కథ అన్నట్లు. "వోవర్ స్పీడింగ్. ఎర్ర సిగ్నల్‌ని కాదని ముందుకు దూసుకుపోయినందుకు బుక్ చెయ్" అన్నాడు వెంకటసామి. "ఎంత జరిమానా పడుతుందో తెలుసా?" అన్నాడు డ్రయివర్ వేపు తిరిగి అప్పారావు. "బాబ్బాబు కాస్త మనసుపెట్టి కనికరించండి. పిల్లలుకలవాడిని-యీ పది రూపాయిలు తీసుకుని వదిలేయండి" అన్నాడు డ్రయివర్.

"అలా కూర్చో- నాకు లంచాలు తినే అలవాటు లేదు" అన్నాడు అప్పారావు.

"కాకపోతే యింకో అయిదువేసుకోండి" నసిగాడు డ్రయివర్.

"ఛీ. ఛీ నీ దగ్గర డబ్బు తీసుకుంటానా అలా నీరసంగా వున్నావేమిటి. ఏం తినలేదా! నాతో రా ప్రక్కనున్న హోటల్‌కి వెళ్ళి టిఫిన్ చేసి వద్దాం" అన్నాడు అప్పారావు.

డ్రయివర్‌కి ఏనుగంత బలం వచ్చింది.

ఇద్దరూ కలిసి ఎదురుగా వున్న మిలిటరీ హోటల్లోకి ప్రవేశించారు. డ్రయివర్ కాఫీ త్రాగి బీడీ కాల్చుకుందుకు పైకి వెళ్ళి యిరవై నిమిషాల తరువాత లోపలికి వచ్చాడు. పోలీసు డిపార్ట్‌మెంట్ వాళ్ళు ఎవరైనా యింకొకరితో హోటల్‌కి వస్తే బిల్లు ఎవరికివ్వాలో తెల్సిన సర్వరు బిల్లు డ్రయివర్ చేతిలో పెట్టాడు. పార్సిల్ అప్పారావుకి అందించాడు. బిల్లు చూసిన డ్రయివరుకి మతిపోయింది. ఏభై ఎనిమిది రూపాయలు—చికెన్ బిరియాని. ఫిష్‌కర్రీ. మటన్ పలావ్—తినడమే కాకుండా ఇంటికిపార్సిల్ కూడా. 'వెంకటసామికి యిరవై రూపాయలు వదేస్తే బాగుండేది'అనుకున్నాడు డ్రయివర్.

—ఒ. ఆర్. కె. రావ్